క్లుప్తంగా

అట్రాసిటీ కమిటీ సభ్యుడిగా యేసోబు



తోటపల్లిగూడూరు : మండలంలోని వెంకన్నపాళెం పంచాయతీ మాజీ సర్పంచ్ యేసోబు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా యేసోబు తన అనుచరులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి గ్రామసభలు



విడవలూరు: మండలంలోని రామతీర్థం, చౌకచర్ల గ్రామాల్లో ఉపాధి పనులను డీఆర్పీలు పెంచలప్రసాద్, నాగేశ్వరరావు సోమవారం తనిఖీ చేశారు. అనంతరం గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి కూలీలతో ముఖాముఖి మాట్లాడి ఉపాధి పనులు జరుగుతున్న తీరు, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ల పనితీరుపై ఆరాతీశారు. చౌకచర్ల, రామతీర్థం పంచాయతీల కార్యదర్శులు శ్రీలత, రాధ పాల్గొన్నారు.

మండలాభివృద్ధిపై సమీక్ష

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీపీ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి మండలాధికారులు హాజరై శాఖల వారీగా మండలంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి



ముత్తుకూరు: చిన్నపిల్లలు విద్యార్థి దశ నుంచే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ కరెంట్ అఫైర్స్ డిప్యూటీ సెక్రటరీ బుడిగి శ్రీనివాసులురెడ్డి సూచించారు. గోపాలపురంలోని ఆదాని వరల్డ్ స్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవరుచుకోవాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు విశేషమైన కృషి చేయాలన్నారు. సమస్యలు ఎదురైతే ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఖాళీ సమయాల్లో మంచి పుస్తకాలు చదవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఎంఈఓలు మధుసూదన్, హేమసుందర్, ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): ఏడేళ్ల చిన్నారి బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో షేక్ మస్తాన్ అనే వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మస్తాన్ కొడవలూరు మండలం దర్గా సంఘం ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతను 2019 మార్చి 20వ తేదీన స్కూల్‌కు వెళ్తున్న ఏడేళ్ల బాలికను పూరిగుడిసెలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక ఏడుస్తుండగా తల్లి విషయం తెలుసుకుని అదేరోజు కొడవలూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మస్తాన్‌పై నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజారెడ్డి కేసు వాదించారు.

అక్కచెల్లెమ్మలకు స్థిరాస్తి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



మహిళకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : వైఎస్సార్ జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాలను అక్కచెల్లెమ్మల పేరుపై రిజిస్ట్రేషన్ చేసి వారికి జగనన్న స్థిరాస్తిని కల్పిస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన 1660 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న కాలనీల ఏర్పాటు ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటే చంద్రబాబునాయుడు కోర్టుల్లో కేసులు వేయించి అడ్డుకున్నారన్నారు. ఈ కారణంగానే ఇంటి పట్టాల పంపిణీ ఆలస్యమైందన్నారు. లబ్ధిదారులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందజేస్తుందన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నా 33 సంక్షేమ పథకాలను అమలు చేసి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వలంటీర్లు వేకువజామునే లబ్ధిదారుల ఇళ్ల తలుపుతట్టి మరీ పింఛన్లు అందజేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను ఓడించేందు ప్రతిపక్షాలన్నీ ఏకమై వస్తున్నాయన్నారు. ప్రజల ఆశీర్వాదం మెండుగా ఉన్న జగనన్న సింగిల్‌గానే మీ ముందుకు వస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, నల్లపరెడ్డి రంజిత్ కుమార్‌రెడ్డి , పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు శ్రీలత, ఎంపీపీ టీ పార్వతి, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి, జుబేర్‌బాషా, సర్పంచ్ వై విజయ, ఎస్ లక్ష్మీకుమారి, ప్రమీలమ్మ, రమణారెడ్డి, లక్ష్మీనారాయణ, విజయ్‌సేనారెడ్డి, రాజగోపాల్, చిరంజీవి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, గండవరపు వసంత్ కుమార్ రెడ్డి,మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, తహసీల్దార్ విజయశ్రీ, డీటీ ఇలియాజ్, ఆర్‌ఐ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వాటర్‌ప్లాంట్ నిర్మిస్తాం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను నిర్మిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మొగళ్లూరులో రూ.8 లక్షలతో నిర్మించిన కాకాణి రమణారెడ్డి వాటర్‌ప్లాంట్‌ను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్, ప్రభుత్వ సహకారంతో నిర్మించిన వాటర్ ప్లాంట్లు ఉన్నాయన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ వాటర్‌ప్లాంట్లు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఎంపీటీసీ చెన్నూరు విజయలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు యనమల రమణారెడ్డి, యాతం పెంచలరెడ్డి, పలుకూరు పెంచలనారాయణరెడ్డి, రెడ్డిచర్ల అంకిరెడ్డి, యనమల శ్రీనివాసులురెడ్డి, ఆకుల చిన గంగిరెడ్డి, చెన్నూరు గంగిరెడ్డి పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేయాలి

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: మార్చి 3న మేదరమిట్లలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగే సిద్ధం సభకు పార్టీ శ్రేణులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పిలుపునిచ్చారు. నార్తురాజుపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేదరమిట్లలో సిద్ధం సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు తరలిరావాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిద్ధం సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేసేందుకే పెద్ద ఎత్తున సిద్ధం సభను నిర్వహిస్తున్నారని, పార్టీ శ్రేణులంతా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయాల కన్వీనర్ కే శ్రీనివాసులురెడ్డి, సొసైటీ చైర్మన్ డీ శివకుమార్, సర్పంచ్‌లు ఎన్ శ్రీనివాసులు, ఎం రంగారెడ్డి, నాయకులు ఏ మోహన్‌కృష్ణ, సునీల్‌రెడ్డి, ఆర్ రాజేష్‌రెడ్డి, ఎస్ మాణిక్యరావు, సీహెచ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



ఇందుకూరుపేట: మాట్లాడుతున్న వైద్యాధికారులు

ఇందుకూరుపేట: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు కిషోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు కోరారు. జగదేవిపేట పీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమంపై వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 3,4,5 తేదీల్లో జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు చిన్నారులు 120 మందిని గుర్తించామని తెలిపారు. వారికి పల్స్‌పోలియో చుక్కలు వేసేందుకు 29 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరు వలసవాసుల, హైరిస్క్ ఏరియాలను గుర్తించి ప్రత్యేకంగా చుక్కలు వేస్తున్నామని తెలిపారు. చిన్నారులందరికీ చుక్కలు వేసి నూరుశాతం లక్ష్యాన్ని సాధించేందుకు వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, ఫార్మాసిస్ట్ చంద్రశేఖర్ , ఆశ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోవూరు: మండలంలో మార్చి 3 నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్యారోగ్య సిబ్బంది విజయవంతం చేయాలని ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి నిరంజన్ కోరారు. ఇనమడుగు పీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమంపై వైద్యారోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు.

డివైడర్లపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారి డివైడర్ల మధ్యలో ఫ్లెక్సీలు, ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమణబాబు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డుల ఏర్పాటు సమయంలో లైటింగ్ పోల్స్ దెబ్బతింటున్నాయని, దీనివల్ల నగర పంచాయతీకి ఆస్తి నష్టం జరుగుతుందన్నారు. నిబంధనలను అతిక్రమించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే, వాటిని తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జితో రాకపోకలు సులభతరం



మాట్లాడుతున్న చలపతిరావు, వేదికపై బీజేపీ నేతలు

కొడవలూరు: టపాతోపు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం మూడు మండలాల ప్రజలకు రాకపోకలు సులభతరమవుతాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఆధునీకరించిన 554 రైల్వేస్టేషన్లు, 1500 ఫ్లైఓవర్లు, అండర్ బ్రిడ్జిలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని టపాతోపు అండర్ బ్రిడ్జి వద్ద నేతలు, రైల్వే అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ మూడో రైల్వే ట్రాక్ ప్రారంభమైన నేపథ్యంలో రైల్వేగేట్ మీదుగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఎంతో ప్రాధాన్యత కలిగిన టపాతోపు రైల్వేగేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకుడు ఆంజనేయరెడ్డి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో రైల్వే శాఖ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. తొలుత కొడవలూరు గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు దేశభక్తి గీతాలకు చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రైల్వే ఏడీఈఎన్ కేబీ రాజేంద్రప్రసాద్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వీ వంశీకృష్ణ, చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ ఏ వెంకటేశ్వర్లు, సీటీఐలు ధనసాగర్, జాన్, టీటీఐ హరిబాబు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లు కామేశ్వరమ్మ, బీజేపీ మండలాధ్యక్షులు వెంకటరాఘవేంద్ర, మురళీకృష్ణ, నాగేంద్ర, సుబ్బారావు, మోహన్ పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుగుణ

ముత్తుకూరు: ముత్తుకూరు పీహెచ్‌సీ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ గండవరం సుగుణ సూచించారు. ముత్తుకూరు పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. తొలుత వైద్యాధికారి చందనప్రియ మాట్లాడుతూ ఆస్పత్రికి ఒక కంప్యూటర్, స్టేషనరీ, బీపీ మెషీన్, తదితర సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్పందించిన చైర్మన్ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన వాటి కోసం తీర్మానాలు చేయాలని సూచించారు. అనంతరం సంచార వైద్యసేవలు, పీహెచ్‌సీ నిర్వహణపై సమీక్షించారు. ఎంపీడీఓ లక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు : విద్యాహక్కు చట్టాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రేణుక సోమవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం మండలంలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 5 ఏళ్లు నిండిన పేద పిల్లలకు 25 శాతం సీట్లను కేటాయించినట్లు తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులు మార్చి 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 14417 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వెన్నుపోటుదారులు

- ఉంటే ఎంత..పోతే ఎంత
- నేతల వైఖరిని ఛీదరించుకుంటున్న జనం

కోవూరు: పదవులు అనుభవించి.. తీరా ఎన్నికల సమయంలో ప్రతిపక్షం వేసే ముష్టి కోసం పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోయే వారు వెన్నుపోటుదారులుగా ప్రజల దృష్టిలో మిగిలిపోతున్నారు. తాజాగా ఆ జాబితాలో బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాలకు చెందిన యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు చేరారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని నీరు–చెట్టు, ఉపాధి హామీ పథకం పనుల పేరుతో దోచుకున్న వీరు కేసుల భయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పంచన చేరారు. పార్టీలో చేరిన వారు పదవులను అనుభవించి.. పనుల పేరుతో సంపాదించుకున్నారు. ఎన్నికల వేళ అధికారంలోకి రాలేమని తెలిసినా.. ప్రతిపక్షం ఇచ్చే ముడుపులకు ఆశపడి పార్టీని వీడి వెళ్లడంపై రేబాల గ్రామస్తులే కాదు..సాక్షాత్తు వీరి అనుచరులే మండిపడుతున్నారు. 2019 ఎన్నికల సమయంలో ఎర్రంరెడ్డి, పుట్టా టీడీపీలో ఉన్నారు. వారు వైఎస్సార్‌సీపీకి పనిచేయలేదు. ఆ ఎన్నికల్లో 39,891 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం సాధించారు. రేబాలలో సైతం వైఎస్సార్‌సీపీకి మెజార్టీ వచ్చింది. అయినా టీడీపీ నుంచి వచ్చిన యర్రంరెడ్డి, పుట్టాకు వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం కల్పించారు. పుట్టాను జొన్నవాడ ఆలయ చైర్మన్‌గా నియమించారు. అలాంటి వారు ఎన్నికల సమయంలో తమ స్వలాభం కోసం సముచిత స్థానం కల్పించిన పార్టీకి వెన్నుపోటు పొడవడంపై వారి అనుచరులతో పాటు గ్రామస్తుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అలాంటి వెన్నుపోటుదారులు పార్టీని వీడినా వచ్చే నష్టమేమి ఉండదని పేర్కొంటున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



ముత్తుకూరు: మండలంలోని తాళ్లపూడిలో మత్స్యకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్‌లో భాగంగా సోమవారం నిర్వహించిన ఉచిత కంటి, దంత వైద్యశిబిరాలకు విశేష స్పందన లభించింది. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు శ్రీవిద్య, త్రివేణి ఆధ్వర్యంలో వైద్య నిపుణులు హాజరత్‌కుమార్, లహరి, వెంకట్‌తరుణ్, తదితరులు 102 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కళాశాల అసోసియేట్ డీన్ బాలసుబ్రమణియన్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



విడవలూరు:మండలంలోని వావిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 60 మంది పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు లగుతోటి వినయ్ సహకారంతో ప్యాడ్లు, పెన్నులు, తదితరాలు అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలలోని విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పూర్వవిద్యార్థులు రవితేజ, హేమంత్, మహేష్, శరత్, మాధవ్, లోహిత్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేత మిస్టర్ 360 జట్టు



ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నంలో జరుగుతున్న ఆదాని ఖేల్ రత్న క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. క్రికెట్ పోటీల్లో చలివేంద్ర గ్రామానికి చెందిన మిస్టర్ 360 జట్టు విజేతగా నిలిచింది. ముత్తుకూరులో జరిగిన వాలీబాల్ పోటీల్లో గుమ్మళ్లదిబ్బ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్లకు ఆదాని కృష్ణపట్నంపోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ షీల్డులు బహూకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు : విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

డిగ్రీ పరీక్షలకు 311 మంది గైర్హాజరు

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్ పరీక్షలకు 311 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి ఆర్ మధుమతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 4,356 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 4045 మంది హాజరయ్యారని వివరించారు.